వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి- హుకుంపేట: మావోయిస్టుల బంద్ నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. శుక్రవారం హుకుంపేట మండలం జి.బొడ్డపుట్టు పాఠశాల గేటు వద్ద అంతగిరి ఎస్సై ఎస్. శ్రీనివాస్, హుకుంపేట సివిల్ పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది కలిసి వాహనాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువుల కోసం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముమ్మరంగా గస్తీ ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

హైడ్రో అనుమతులు రద్దు చేయాలి

-సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం-కలెక్టరేట్‌ను ముట్టడించిన గిరిజనులు

ప్రజాశక్తి -పాడేరు: హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన పాడేరులో శుక్రవారం అరణ్య గర్జన ర్యాలీ నిర్వహించారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిరిజనులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ అధ్యక్షత జరిగిన ముట్టడి సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలతో చేసుకున్న అక్రమ హైడ్రో ఒప్పందాలు, జిఒ 51, 13, 02ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభల ఆమోదం లేకుండా ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌బిఐ పోతురాజు, వి.ఉమామహేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాగిన ధర్మానపడాల్, పొద్దు బాలదేవ్, జిల్లా నాయకులు తాపులపుల కృష్ణారావు, హైడ్రోపవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ నాయకులు మజ్జి సురేష్‌కుమార్, కొర్ర స్వామి, భూరిడి దశరథు, నోబో, బస్కి, సర్పంచ్ రమేష్, అరకువ్యాలీ వైస్ ఎంపిపి రామన్న, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మిలి చిన్నబాబు, మాజీ సర్పంచ్ కొండలరావు, భూర్జ ఎంపిటిసి సభ్యులు హరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ ఆమోదంతోనే హైడ్రో పనులు
కలెక్టర్ దినేష్ కుమార్

పాడేరు : గ్రామసభ ఆమోదము లేకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు ముందుకు సాగవని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌ను ముట్టడించిన హైడ్రో నిర్వాసిత గ్రామాల గిరిజనులతో కలెక్టర్ మాట్లాడారు. హైడ్రోపై గిరిజనుల మనోభావాలను అభిప్రాయాలను ప్రభుత్వానికి వివరిస్తానని చెప్పారు.



నాయకులు, గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వినతుల పరిష్కారం వేగవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్- పిజిఆర్ఎస్ కు 166 అర్జీలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 166 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఇన్చార్జి జెసి, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ కె సాహిత్, డిఆర్ఒ కె పద్మలత, పాడేరు ఇంచార్జ్ ఆర్ డిఒ ఎస్ విఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖాధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని..

పెదబయలు మండలం కుంతుర్ల పంచాయతీ కుంత్రేలు గ్రామస్తురాలు బి.జానకమ్మ వితంతు పింఛను మంజూరుకు, అరకువ్యాలీ మండలం చినలబుడు పంచాయతీ మంజ గూడ గ్రామస్థుడు ఎస్.అర్జున్ వృద్ధాప్య పింఛను నుండి వికలాంగుల పింఛనుకు మార్పు చేయమని దరఖాస్తు చేశారు. జికె వీధి మండలం దేవరాపల్లి గ్రామస్తులు కె.రామలింగం, కె.పోతురాజు, డి.పద్మ బిటి రోడ్డు, ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు, డిపట్టాలు, సిసి రోడ్డు, స్కూల్, అంగన్వాడీ భవనాలు మంజూరుకు అర్జీ పెట్టారు. అరకువ్యాలీ మండలం పద్మాపురం గ్రామ సర్పంచ్ పి.సుస్మిత గార్డెన్ దగ్గర వాహనాల పార్కింగ్‌కు దరఖాస్తు చేశారు. జి మాడుగుల మండలం చింతల గొంది గ్రామస్తుడు పి.సూరిబాబు నూతన స్కూల్ భవనం నిర్మాణం, అండంగిసింగి కుంబిడిసింగి మధ్య కొత్త వంతెన నిర్మాణంకు వినతి సమర్పించారు. హుకుంపేట మండలం పందిమెట్ట గ్రామస్తుడు పి.అప్పన్న వృద్ధాప్య పింఛనుకు అర్జీ పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ పిబికె పరిమళ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఆర్ డిఎ పిడి వి.మురళీ, ఆర్అండ్ బి ఇఇ బాల సుందరబాబు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పిఎస్ కుమార్, డిపిఒ కెపి చంద్ర శేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు , డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ.జయప్రకాష్, జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వి రమణారావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.ప్రసాద్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, పి.ఒ, అధికారులు

బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే చర్యలు

-ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్ దొన్నుదొర

ప్రజాశక్తి హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణాన్ని (వైన్ షాప్) గురువారం రాత్రి అరకు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, ఆర్టీసీ విజయనగరం జోనల్ రీజినల్ ఛైర్మన్ సియ్యారి దొన్నుదొర ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం నాణ్యతను పరిశీలిస్తూ, కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయా లేదా అన్నది తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దుకాణ సిబ్బందికి ఆయన సూచిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మీడియాతో మాట్లాడుతూ, "జగన్ పాలనలో నకిలీ మద్యం తయారీకి అధికార ముద్ర వేసి, ఏరులా పారించిన ఘటనలకు వైసీపీ నాయకులే కారణం" అని తీవ్రంగా విమర్శించారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు రాష్ట్రంలో కనిపించకుండా చేసి, డిస్టిలరీలను స్వాధీనం చేసుకొని నేర సామ్రాజ్యం నడిపారని ఆరోపించారు. వైసిపి నాయకులు కల్తీ మద్యం వ్యవహారాల్లో నిందితులుగా ఉన్నా, జగన్ వారిని సస్పెండ్ చేయకపోవడం సిగ్గు చేటన్నారు. గత ఐదేళ్లలో కల్తీ మద్యంతో సంపాదించిన డబ్బులతో కొందరు విదేశాల్లో వ్యాపారాలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. బెల్ట్ షాపులు నడిపేవారిపై కఠిన చర్యలు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కల్తీ మద్యం నిరోధానికి విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ఆధునిక మద్యం పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 13 రకాల నాణ్యతా పరీక్షలు చేసి, కల్తీకి అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శతక బొంజుబాబు, మహిళా నాయకురాలు సూర్యకాంతం, జనసేన నాయకులు సత్తిబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు కొమ్మ రమ్మ, చిట్టిబాబు, బాలకృష్ణ, మాదల సర్పంచ్ శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ నూకరాజు వెంకటరమణ, గ్రామ కమిటీ అధ్యక్షులు బాబురావు, మత్స్యరాజు, పాంగి దాసుబాబు, ఆనందరావు, వంతల వెంకటరావ, అసెంబ్లీ కోఆర్డినేటర్ బాలుదొర తదితరులు పాల్గొన్నారు.



మద్యం సీసాలను పరిశీలిస్తున్న దొన్నుదొర

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

సమీక్షా సమావేశంలో ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలో పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో పలువురు అధికారులతో వనమహోత్సవం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వనమహోత్సవం (వనం మనం) ప్రోగ్రాం ద్వారా వివిధ రకాలైన మొక్కలు ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. ఉద్యానవనశాఖ, అటవీశాఖ ద్వారా ఎన్ని నర్సరీలు ఉన్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయో ఆరా తీశారు. పామాయిల్ ఎన్ని ఎకరాల్లో వేశారో తెలుసుకున్నారు. ఏజెన్సీలో రోడ్డుకు ఇరువైపులా ఎన్ని మొక్కలు కావలసి ఉన్నది యాక్షన్ ప్లాన్ తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ప్రాంత గిరిజన రైతులకు జాఫర్, మామిడి మొక్కలు, జీడిమామిడి మొక్కలు ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, అడిషనల్ డిఎంహెచ్ఒ సరిత, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, పీహెచ్ఒ దేవదానం, ఎడిఎ సావిత్రి, ఫారెస్ట్ రేంజ్ అధికారి షరీఫ్, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కృష్ణమోహన్, తులసీదాస్ అన్ని మండలాల విద్యాశాఖాధికారులు, ఉపాధి హామీ ఎపిఒలు, వెలుగు ఎపిఎంలు, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెలుగు ఎపిడి దేగలయ్య, బి.వెంకటరమణ, ఎంఇఒ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి

ఏజెన్సీలో గంజాయి నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని పిఒ స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. పోలీస్, ఎక్సైజ్ శాఖాధికారులు తదితరులతో మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గతంలో గంజాయి సాగు చేసిన వారు ప్రస్తుతం ఏ పంటలు సాగుచేస్తున్నారో తెలుసుకోవాలన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఏజెన్సీలో వివిధ ఇంజనీరింగ్ విభాగాల ద్వారా మంజూరైన పనులు త్వరగా పూర్తిచేయాలని పిఒ అధికారులను ఆదేశించారు. ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ తదితరులతో మాట్లాడారు. పిఎం జన్‌థన్ ఫేజ్ వన్, పేజ్ టు ద్వారా ఎన్ని పనులు మంజూరయ్యాయి ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నవి ఆయన ఆరా తీశారు. ఎన్ని గృహాలు మంజూరైనవి, ఎన్ని గృహాలు పెండింగ్‌లో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రోడ్లు భవనాలశాఖ ద్వారా ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో అంబులెన్స్‌లు గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలు సకాలంలో అందుతున్నాయా లేదా అని అడిగి, సరైన వైద్యసేవలు అందించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ



సంతనేరేడుపల్లి పాఠశాల వద్ద హెచ్ఎం, విద్యార్థులు

పాఠశాల అదనపు భవనానికి నిధులు

ప్రజాశక్తి-సీలేరు: జీకేవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ సంత నేరేడుపల్లి ఎంపీపీ స్కూలుకు మనబడి మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అదనపు తరగతి భవన నిర్మాణానికి రూ.14.50 లక్షలు మంజూరు చేసిందని పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మి వెల్లడించారు. ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపిపి స్కూల్ ఆవరణలో శుక్రవారం విద్యాకమిటీ విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయ సిబ్బంది సమక్షంలో సమావేశం నిర్వహించారు. సంతనేరేడుపల్లెలో 1998లో నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. మనబడి మన భవిష్యత్తు కమిటీని నూతనంగా ఏర్పాటు చేశామని ఇందులో కన్వీనర్‌గా హెచ్ఎం ధనలక్ష్మి, ఎస్ఎంసి చైర్మన్‌గా కిలోఅర్జున్, వైస్ చైర్మన్‌గా కిలో రాదా కమిటి సభ్యులుగా ఎన్.కంబిడి, కె.అస్త్రం, ఎం.సుబ్బారావు ఎన్నికయ్యారు. కాంప్లెక్స్ సిఆర్పి ఏడివి కుమార్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ రాజేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమను ఎంపిక చేశామన్నారు. వీరి ఆధ్వర్యంలో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి విద్యార్థులు తల్లిదండ్రులు, కమిటీ సభ్యులను పనులలో భాగస్వామ్యం చేసి పనులు పూర్తి చేయాలని హెచ్ఎం తెలిపారు.

టూరిజం పార్కు షాపులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - రంపచోడవరం : సిసిడిపి పథకం క్రింద ఐ.పోలవరం గ్రామంలో టూరిజం పార్క్‌లో నిర్మించిన 260 చదరపు అడుగుల షాపు నెం.3కు అద్దె రూ.4000/-లు గాను 400 చదరపు అడుగుల షాపు నెం.2 కు అద్దె రూ.4500/-లు గాను నిర్ణయించి గిరిజన యువతీ యువకుల జీవనోపాధికి కేటాయించడమైనది. ఉత్సాహవంతులైన గిరిజన యువత దరఖాస్తు చేసుకోనవలసినదిగా కోరుతూ, ధరఖాస్తుతో పాటుగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మీసేవ కుల ధ్రువీకరణ పత్రంతో పాటు, ఫోన్ నెం వివరాలు తెలియచేస్తూ ఐటిడిఎలో నవంబర్ 1 వ తేదీలోగా ఇవ్వాలన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గంగవరం: గంగవరం మండల పరిధిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అలాగే నెల్లిపూడి గ్రామ శివారులో ఐదు లీటర్ల నాటు సారాతో మహిళను అరెస్టు చేసినట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి అసాంఘిక కార్యక్రమానికి పాల్పడినా , సహకరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మండల కేంద్రం ఏర్పాటు చేస్తే స్వచ్ఛందంగా భూములిస్తాం

ప్రజాశక్తి -సీలేరు:

జికె వీధి మండలం దారకొండలో మండల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ అధికారులు మండల కేంద్రం ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సీలేరు దుప్పిలివాడ దారకొండ గుమ్మిరేవులు ఏ దారకొండ గాలికొండ పంచాయతీ పరిధిలో వందలాది గ్రామాలు అభివద్ధికి నోచుకోవడం లేదన్నారు. దారకొండ మండల కేంద్రం ఏర్పాటు చేస్తే అన్ని రకాలుగా అభివద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

'వైద్యుల నిరక్ష్యంతోనే తల్లీ, శిశువు మృతి'

ప్రజాశక్తి-రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే కోటం బాపనమ్మ, ఆమె శిశువు మృతి చెందారని ఆదివాసీ సంక్షేమ పరిషత్(274/16) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను ఆరోపించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ కోటం బాపనమ్మ బంధువుల ఆధ్వర్యంలో శుక్రవారం ఐటిడిఎ వద్ద శాంతియుత నిరసన తెలిపి, రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ ను కలసి ప్రభుత్వా ఆస్పత్రులపై సరైన దృష్టి పెట్టడం లేదని, రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసే వరకు తమ ఉద్యమాన్ని ఆపబోయేది లేదని ఆయన హెచ్చరించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ఉపాధ్యక్షు రాలు బోరగా ఎర్రమ్మ, డివిజన్ ప్రధాన కార్యదర్శి జోడి ప్రదీప్ కుమార్ దొర, డివిజన్ కోఆర్డినేటర్ పీట ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం విక్రయాలపై సర్పంచ్ ఆగ్రహం

ప్రజాశక్తి - గంగవరం: మోహనాపురం పంచాయతీలో మోహనాపురం, సరభవరం, నువ్వుమామిడి గ్రామాల్లో విచ్చలవిడిగా నాటుసారా తయారీ అమ్మకాలు చేపడుతున్నారని మోహనపురం సర్పంచ్ కూరసం అక్కమ్మ, పీసా ఉపాధ్యక్షుడు సన్యాసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు బెల్ట్ షాపులు, సారా దుకాణాలు హద్దులు మీరుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల డబ్బులు, సారా దుకాణాలకు తాకట్టుపెట్టి ఆరోగ్యాలు పాడు చేసుకుంటునరన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. పీసా సెక్రటరీ కురసం సూరిబాబు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి సామగ్రి వితరణ

ప్రజాశక్తి- చింతూరు: చింతూరు గ్రామానికి చెందిన సోడే నాగమ్మ అనే గిరిజన మహిళ ఇల్లు గతంలో తుఫాన్‌కు కూలిపోవడంతో ఇల్లు లేక అవస్థలు పడుతోంది. ఈ విషయాన్ని జమాల్‌ఖాన్‌కు సోడే నాగమ్మ తెలిపింది. సాయం చేయాలని కోరింది. దానికి ఆయన స్పందించి శుక్రవారం ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంటు రేకులు ఇనుప పైపులను అందజేశారు. ఎండీ అబ్రార్, ఎండీ నాదార్, పి.సాల్మన్‌రాజు, బాబు,అజీజ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సామగ్రి అందిస్తున్న జమాల్‌ఖాన్

మావోయిస్టుల బంద్ ప్రశాంతం

ప్రజాశక్తి -సీలేరు:

మావోయిస్టులు తలపెట్టిన బంద్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దుల్లో ముందస్తుగా పోలీసులు అప్రమత్తమై భద్రతా చర్యలు చేపట్టారు. స్థానిక ఎస్ఐ యాసీన్ సీలేరు పరిసర ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. ప్రధాన కూడళ్ళలో సిఆర్‌పిఎఫ్ బలగాలు మోహరించి గస్తీ ముమ్మరం చేశారు. బంద్ కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు ప్రజలు పీల్చుకున్నారు. మావోయిస్టులు బంద్ శుక్రవారం సాయంత్రం తో ముగియడంతో శనివారం రాత్రి నుంచి విశాఖ వయా చింతపల్లి సీలేరు మీదగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ సీలేరు నైట్ హాల్ట్ బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు విశాఖ ఆర్టీసీ మేనేజర్ మాధురి వెల్లడించారు.



డొంకరాయి జలాశయం నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకరాయి జలాశయం నుంచి శుక్రవారం 4000 క్యూసెక్కుల నీటిని నేరుగా దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నామని ఎపి జెన్కో ఏఇఇ శివశంకర్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డొంకరాయి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు (ఇన్ఫ్లోస్) జలాశయంలో 8వేల క్యూసెక్కులు నీరు చేరుతుందని పేర్కొన్నారు. డొంకరాయి జలాశయం నీటిమట్టం 1036.60 అడుగులు నీటిమట్టాలను సమాంతరంగా ఉంచుతూ జలాశయానికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామన్నారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం పవర్ కెనాల్ ద్వారా మరొక 4000 క్యూసెక్కులు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. రిజర్వాయర్ ఎటువంటి ముప్పు వాటిల్లకుండా సిబ్బందితో ఎప్పటికప్పుడు పరివేక్షిస్తున్నామని ఏపీ జెన్కో ఎఈఈ శివశంకర్ తెలిపారు.

ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలి



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని చౌడుపల్లి పంచాయతీ వాముగడ్డ గ్రామ పరిధిలోని రిజర్వు అటవీ భూముల్లో ఐదు దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులకు ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరుతూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి గురువారం గ్రీవెన్స్ సమావేశంలో ఆర్డీవోకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1998లో రెవెన్యూ శాఖ అధికారులు రిజర్వు ఫారెస్ట్ భూములను రెవెన్యూ భూములుగా చూపిస్తూ 51 మంది గిరిజన రైతులకు జిరాయితీ పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. ఇటీవల కాలంలో రైతు భరోసా, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాల కోసం భూమి వివరాలు పరిశీలించగా రిజర్వు ఫారెస్ట్ భూముల్లో జిరాయితీ పట్టాల మంజూరు అంశం వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో నేడు గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఈ భూములను సర్వే చేసి అర్హత ఉన్న ఆదివాసీ గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఆర్డీవో స్పందిస్తూ, గిరిజనులకు హక్కులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంతల సత్తిబాబు, కిళ్లో సాయితాన్య, వంతల దామోదర్, కిళ్లో త్రినాధ్, వంతల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విధి నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని స్థానిక మండల ఎంఈఓ 2 జి.గేన్ను సూచించారు. మండలంలోని చిన్నఅంజోడ, పెద్ద అంజోడా, సాయి నగర్ ఎంపీపీ, జిపిఎస్ పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలల తరగతుల నిర్వహణపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు కూడా తనిఖీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు ప్రతిరోజు మధ్యాహ్నం పెట్టే మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పరిశీలిస్తుండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హుస్సేన్, అప్పన్న, సీఆర్పీ కాంతారావు పాల్గొన్నారు.

బొర్రా టోల్‌గేట్ మూసివేత

ప్రజాశక్తి- అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన టోల్ గేట్ మూసివేస్తామని స్థానిక సర్పంచ్ జన్ని. అప్పారావు వెల్లడించారు. పంచాయతీ. పేసా ఎటువంటి అనుమతులు పొందకుండా మండల పరిషత్ నిర్వహించడంతో పంచాయతీ గుర్తించి నిలిపివేసినట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పంచాయతీకి చెల్లించవలసిన రాయల్టీ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని తెలిపారు. దీనిపై పంచాయతీ బాడీ ఏకగ్రీవ తీర్మానంతో మూసివేసామని పంచాయతి స్వాధీనం చేసుకొని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉప సర్పంచ్ గుబ్బయి లక్ష్మీ, వార్డు మెంబర్లు ఎస్.సింహాద్రి, జె.లక్ష్మీ పాల్గొన్నారు

పాఠశాల స్థాయి పరీక్షలు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉన్న 11 మండలాల్లో చెకుముకి పాఠశాల స్థాయి పరీక్షలు శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ పరీక్షల్లో 54 పాఠశాలల నుండి 2956 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతీ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు చొప్పున 162 మంది విద్యార్థులు నవంబర్ 1 న ఆయా మండలాల్లో జరిగే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి యండమూరి పారయ్య తెలిపారు. నవంబర్ 23 జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు, మండల బాధ్యులు, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మూడో రోజుకు చేరిన ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ సమ్మె



అరకులోయలో మాట్లాడుతున్న బాలదేవ్



పాడేరులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి అరకులోయ: జిల్లాలో పాడేరు, అరకులోయ, ముంచంగిపుట్టు, చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు కనీసవేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె మూడు రోజుకు శుక్రవారం చేరింది. అధికారులు, సంబంధిత యాజమాన్యం కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. అరకులోయ ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సమ్మె శిబిరంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ శుక్రవారం పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 నవంబర్ నెల నుంచి కొత్త వేతనం 18600 రూపాయలు చెల్లించాలని, కొత్తగా చేరిన కార్మికులకు పీఎఫ్ అమలు చేయాలని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలన్నారు. అదనపు పనులు అప్పగించవద్దని, టెండర్ విధానం రద్దు, పాతవారికి నాలుగు నెలల బకాయిలు, కొత్తవారికి సంవత్సరం నుండి బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, పని పరికరాలు, రక్షణ కవచాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రతినెలా మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేసి వైద్య విధాన పరిషత్ ద్వారా కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి రఘు, నాయకులు బాలన్న, సూర్య, రమేష్ సుశీల కార్మికులు పాల్గొన్నారు.

చింతపల్లి : మూడు రోజులపాటు సాగిన ఆసుపత్రి శానిటేషన్ కార్మికుల సమ్మె విజయవంతమైంది. మూడో రోజు శుక్రవారం సాయంత్రం సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ దీక్షా శిబిరంలో నిమ్మరసం ఇచ్చి దీక్షలను విమరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కాంట్రాక్టర్ చేసిన నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను డిసెంబర్‌లోగా పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. బకాయి వేతనాల్లో ఒక నెల జీతాన్ని వారంలోగా చెల్లించడానికి అంగీకరించారని, మిగిలిన జీతాలను దశలవారీగా విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. న్యాయపరమైన హక్కుల కోసం ఐక్యమత్యంగా భవిష్యత్తులో కూడా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామారావు, ఈశ్వరరావు, గిరిబాబు, గున్నమ్మ, రాములమ్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: కార్మికుల సమస్యలు పరిష్కారానికి పోరాటాల శరణ్యమని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు అన్నారు శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి శానిటేషన్ కార్మికుల సమ్మె మూడో రోజు అయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంట్రాక్టు కార్మికుల శ్రమని దోచేస్తున్న అధికారుల పట్టించుకోవడంలేదని తెలిపారు. 2024 నవంబర్లో శానిటేషన్ కార్మికులకు 18,600 వేతనం చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసిన కాంట్రాక్టులు అమలు చేయకుండా ఎగ్గొడుతున్నారని తెలిపారు తక్షణం జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్పటల్ అన్నిట్లోనూ కాంట్రాక్టర్లు 18600 జీవో అమలుకై అధికారులు ఒత్తిడి తీసుకొచ్చి అమలు చేయించాలని డిమాండ్ చేశారు పాత కాంట్రాక్టర్లో పెండింగ్ వేతనాలు, పీఎఫ్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాత కాంట్రాక్టర్ చర్చలు జరిపి సమస్యను పరిష్కరించడం జరిగింది. వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు యూనియన్ నాయకులు చర్చించుకుని శనివారం సమావేశంలో సమ్మెను విరమించేందుకు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎల్ సుందర్రావు, మండల కన్వీనర్ ప్రసాద్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ముత్యాలమ్మ రఘు, కార్యక్రమంలో ముంచింగి పుట్టు, చింతపల్లి, హాస్పిటల్ నుండి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గిరిజనేతరుల కుల ధ్రువీకరణలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-చింతపల్లి : గిరిజనేతరులకు ఎస్టీ వాల్మీకి ఉపజాతి పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం అన్యాయమని, వాటిని తక్షణమే రద్దు చేయాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజను గురువారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. చింతపల్లి మండలం గొందిపాకల పంచాయతీ పరిధిలోని గొందిపాకలు, సమగిరి గ్రామాలకు చెందిన చింతపల్లి జ్యోత్స్న ప్రియ, చింతపల్లి రాంబాబు, దుమ్ముల అనిత కుమారి, దుమ్ముల మధుబాబు తదితర నలుగురు గిరిజన వాల్మీకి ఉపజాతి పేరుతో గిరిజన కుల ధ్రువీకరణ పత్రాలు పొందినట్లు తెలిపారు. చింతపల్లి, దుమ్ముల అనే ఇంటిపేర్లు వాల్మీకి ఉపజాతిలో లేవని, వారి పేర్లు స్థానిక గ్రామస్తులకు కూడా తెలియదని, వీఆర్వోకు కూడా సమాచారం లేకుండానే ఈ పత్రాలు జారీ కావడం అనుమానాలకు తావిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గొందిపాకల పంచాయతీ సర్పంచ్ సాగిన వరలక్ష్మి, గెమ్మెల అబ్బాయి నాయుడు, రొబ్బ యశ్వంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జి.మాడుగులలోనే ఉంచాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని పెదలువ్వాసింగి గ్రామ పంచాయతీని నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్దిగరవు మండలంలో కలపకుండా జి.మాడుగుల మండలంలోని ఉంచాలని గ్రామ పంచాయతీ పరిధిలోని పంచాయితీ సర్పంచ్, ఎంపీటీసీ 4 క్లస్టర్ల పెసా కమిటీ ఉపాధ్యక్ష కార్యదర్శులు, వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. పెదలువ్వసింగి గ్రామపంచాయతీని జి.మాడుగుల మండలంలోని ఉంచాలని తీర్మానం చేశారు. నూతనంగా మద్దిగరువు మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న పెదలువ్వసింగి గ్రామపంచాయతీకి చాలా దూరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర, మాజీ ఎంపీపీ ఎస్ వి రమణ, ఉప సర్పంచ్ గబ్బాడి గణపతి, మాజీ సర్పంచులు గబ్బాడి పండు దొర, తల్లే చిట్టిబాబు, పిసా ఉపధ్యక్షులు ఉలంగి పిన్నారావు, క్రరీనాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

బూసిపుట్టు విలీనంపై నిరసన



వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని అత్యంత మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బూసి పుట్టు గ్రామ పంచాయతీలోని 18 గ్రామాలను విలీనం చేస్తూ నూతనంగా ఏర్పాటు చేయబోతున్న మద్దిగరువు మండలంలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తుండటంపై బూసి పుట్టు పంచాయతీ సర్పంచ్ రాజమ్మ, ఎంపీటీసీ కిముడు రాములమ్మ, వార్డు సభ్యులు పంచాయతీలోని ప్రజలకు చైతన్యపరిచి శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. తహసిల్దార్ , ఎంపీడీవో కార్యాలయం వద్ద బూసిపుట్టు పంచాయతీని విలీనం చేయొద్దని ఆందోళన చేశారు. తహసిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కామరాజు, మండల ఎంపీడీవో కే ధర్మరావు లకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ1 పాటు భోయి సత్యనారాయణ , ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు నర్సింగ్ పడాల్ పాల్గొని మద్దతు తెలిపారు. సర్పంచ్ రాజమ్మ మాట్లాడుతూ, పంచాయతీలోని 18 గ్రామాలలో 11 గ్రామాలలో పివిటిజి గ్రామాలు ఉండగా సుమారు 1700 మంది జనాభా కలిగి ఉన్నామన్నారు. బూసి పుట్టు గ్రామ పంచాయతీ అభివృద్ధి చెందుతోందన్నారు., గతంలో మావోయిస్టు ప్రభావితంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. బూసి పుట్టు పంచాయతీ కేంద్రం నుండి ముంచింగిపుట్టు చేరుకోవడానికి కేవలం 25 కిలోమీటర్లు కలిగి ఉంటే, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మండలాల విభజన పేరిట సుమారు 45 కిలోమీటర్లు దూరంలోనీ మద్దిగరువులో బూసి పుట్టు పంచాయతీని విలీనం చేసేందుకు ప్రణాళికాలు చేస్తోందని ఆగ్రహించారు. మద్దిగరువుకు చేరుకోవడానికి రాకపోకలకు రహదారులు లేవని, వాగులు, కొండలు, గుట్టలు దాటుకుంటూ 45 కిలోమీటర్లు ప్రయాణిస్తే తప్ప చేరుకోలేమని తెలిపారు. బూసి కుట్టు పంచాయతీ ఆదివాసి గిరిజన పివిటిజి తెగలతో పాటు, వివిధ తెగల వారి అభివృద్ధికి ప్రాధాన్యత చూపి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సర్వేలను నిలుపుదల చేసి బూసిపుట్టు పంచాయతీని ముంచంగిపుట్టు మండలంలో కొనసాగించే విధంగా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ కిముడు రాములమ్మ మాట్లాడుతూ, గత పది సంవత్సరాల క్రితం పంచాయతీ ప్రజలు మావోయిస్టులకు ప్రభావితమై అనేకుల జీవితాలు చిన్న భిన్నమయ్యాయని, పంచాయతీ ప్రజలు ప్రస్తుతం మెరుగైన జీవితాన్ని కొనసాగిస్తున్నారన్నారు. పిసా కమిటీ ఉపాధ్యక్షుడు పాంగి జయరాం, కార్యదర్శి కీముడు సింహాచలం, సరియపల్లి పీసా ఉపాధ్యక్షుడు కీముడు రాజారావు, కార్యదర్శి కొర్ర సూర్యనారాయణ, పంచాయతీ ప్రజలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు

తహశీల్దార్‌గా శంకరరావు బాధ్యతల స్వీకరణ



శంకరరావు, తహశీల్దార్

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండల తహశీల్దార్‌గా కె.శంకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో చింతపల్లి మండల తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించిన జి.ఆనందరావు అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ముంచంగిపుట్టు మండల తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించిన కే.శంకరరావు చింతపల్లికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ భూసంబంధిత సమస్యలు, రైతుల పంట సమస్యలు, పత్రాల జారీ వంటి అంశాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. బదిలీ అయిన జి.ఆనందరావు మాట్లాడుతూ చింతపల్లి ప్రజల సహకారం ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. అనంతరం ఆనందరావుకు సిబ్బంది శాలువా కప్పి సన్మానించి, మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో టి.పండయ్య, విష్ణు, వంశీ ప్రసాద్, నూకరాజు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దారకొండ - గుమ్మిరేవుల బస్సు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ నుంచి గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో తిరిగే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఆయా పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మత్తుల్లో భాగంగా మట్టితో డైవర్షన్ రోడ్లను అధికారులు ఏర్పాటు చేశారు. అనంతరం కొన్నాళ్ళు నర్సీపట్నం వయా చింతపల్లి మీదగా దారకొండ మీదగా గుమ్మిరేవుల వరకు బస్సు తిప్పేవారు. ఇటీవల తుఫానుకల్వర్టులు మట్టి రహదారులు కొట్టుకుపోయి రహదారి బురద మయంగా మారి అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో గుమ్మరేవుల బస్ సర్వీసును గత మూడు నెలలుగా నిలిపివేశారు. గుమ్మిరేవుల రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో నర్సీపట్నం - సీలేరు తిప్పే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలోని ఆర్.దొడ్డవరం గ్రామానికి చెందిన మొట్టడం శ్రీనివాసరావు (50) వ్యక్తి మృతి చెందినట్లు మంప ఎస్ఐ శంకరరావు తెలిపారు. శ్రీనివాసరావు ప్రతిరోజూ తన పొలానికి రాత్రి కాపలా ఉండేందుకు వెళుతుంటారు. గురువారం రాత్రి రోజూలాగే వెళ్లి శుక్రవారం ఉదయాన్నే ఇంటికి వస్తుండగా చాపరాయి మీదుగా నడుస్తుండగా, కాలు జారి కిందపడినట్లు దీంతో ఆయన తలకు, వెన్నెముకకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబసభ్యులు గ్రామస్థులు ఆయనను రామవరం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మంప పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని రాజవొమ్మంగి సిఐ గౌరీశంకర్, ఎస్సై శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముల్లిమెట్ల గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గౌరీ శంకర్ మాట్లాడుతూ గ్రామస్తులు కోడిపందాలు,చిత్తులాట, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలతో బాటు, గంజాయి అక్రమ రవాణా చేసిన వారికి సహకరించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
రంపచోడవరం : రంపచోడవరం డిఎస్‌పి సాయిప్రశాంత్, సీఐ శ్రీ ఎన్. సన్యాసినాయుడు ఆధ్వర్యంలో గంజాయి మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్‌పీహెచ్ఎస్ విద్యార్థులకు పోలీసులు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, అలాగే గంజాయి కేసులపై చట్టపరమైన శిక్షలు గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది కలిసి జూనియర్ కాలేజీ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు "గంజాయికి నో చెప్పండి భవిష్యత్తు కాపాడుకోండి" వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ రాజ్ కోటి, అదనపు ఎస్ఐ భూషణం, ప్రిన్సిపాల్, స్కూల్ హెడ్‌మాస్టర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రంపచోడవరం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మత్తుల నేపథ్యంలో అడ్డతీగల వైరాంబరం రాజీవ్ మంగి మండలాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఎఇ వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజవొమ్మంగి, వై.రామవరం, అడ్డతీగల మండలాల్లో కూడా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.
రంపచోడవరం: ఈ నెల 25న 220 కెవి సబ్‌స్టేషన్ రంపచోడవరం నందు మరమ్మతులు ఆధునీకరణ పనుల నిమిత్తం రంపచోడవరం, మారేడుమిల్లి,గంగవరం మండలాలకు సంబంధించిన పరిసర ప్రాంతాలకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరంచ వలసిందిగా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. వి. రమణ ఒక ప్రకటనలో తెలిపారు.

మౌలిక వసతులూ కరువాయె..!



పేరుకుపోయిన బురద

ప్రజాశక్తి- కొయ్యూరు: కొయ్యూరు వాల్మీకి వీధిలో వసతులు లేక స్థానికులు విచారం వ్యక్తం చేస్తు న్నారు. వీధి రోడ్లు, డ్రైనేజీలు లేక తోవ బురదమయమై ఉంది. డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు సీసీ రోడ్డు మీదకు వస్తోంది. తాగునీటి కుళాయిలు కూడా సక్రమంగా లేవని పలువురు వాపోతున్నారు. వర్షాకాలంలో తమ వీధి ప్రజలంతా ఇంటి నుండి బయటకు రాలేని దుస్థితిలో ఉన్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్

ప్రజాశకి- అడ్డతీగల: మండలంలోని బాలురు గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల విద్యా వనరుల కేంద్రం, గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల, అడ్డతీగల, భీమవరం పాఠశాలలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ సెంటర్ శశికుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మరింత మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.
అలాగే ఉన్నత పాఠశాలలు, స్త్రీ శక్తి కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని అక్టోబర్ 31 వరకు అడ్మిషన్లు జరుగుతాయని ఎఐ కోఆర్డినేటర్లు మండల విద్యాశాఖాధికారులు, హెచ్ఎంలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ దీనిపై దృష్టి పెట్టి బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్‌ను పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ గూర్చి తెలియజేసియున్నారు. ఏపీ ఓపెన్ స్కూల్ కరపత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ ప్రభాకరరావు, ఎంపిడిఒ వివిఎస్ కుమార్, మండల విద్యాశాఖాధికారి పి శ్రీనివాస్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్స్ చిన్నిబాబు, అడపా వీరబాబు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



చింతూరు: మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్

ప్రజాశక్తి - రంపచోడవరం : పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రంపచోడవరం డిఎస్‌పి సాయిప్రశాంత్, సిఐ ఎన్. సన్యాసినాయుడు ఆధ్వర్యంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ జెడ్‌పీహెచ్ఎస్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అమరులైన పోలీసు సిబ్బంది దేశం కోసం చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ రాజ్‌కోటి, అదనపు ఎస్ఐ శ్రీ భూషణం సిబ్బంది పాల్గొన్నారు.
చింతూరు: అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని చింతూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు 'లైంగిక వేధింపుల నుండి మహిళల, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్ఐ పి.రమేష్ మాట్లాడుతూ పోలీసుల సేవపై అవగాహన కల్పించారు. పోలీస్ వ్యవస్థ సమాజానికి అందిస్తున్న నిస్వార్థసేవలను అధికారులు వివరించారు: రోడ్డు ప్రమాదాలు, వరదలు, అగ్ని ప్రమాదాల వంటి విపత్తుల సమయంలో పోలీసులు ముందండి నడిచి ప్రజలకు ఆసరాగా ఉంటారని తెలిపారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, పోలీసుల పట్ల గౌరవం పెరగాలని ఎస్ఐ తెలిపారు.
రాజవొమ్మంగి :లైంగిక వేధింపులపై తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి విద్యార్థినిలకు స్థానిక సీఐ గౌరీ శంకర్ జడ్డంగి రాజవొమ్మంగి ఎస్సైలు చినబాబు, శివకుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. పోలీస్ స్మారక వారోత్సవం సందర్భంగా, స్త్రీలు, బాలలను లైంగిక చర్యల నుండి రక్షించడంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై స్థానిక గురుకుల కళాశాల,జడ్డంగి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమాజంలో ఎంతటి తీవ్రమైన సమస్య ఉన్నా దాన్ని అరికట్టడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంత ముఖ్యమో వారు తమ వ్యాసాల ద్వారా వివరించారని సీఐ గౌరీ శంకర్ తెలిపారు. పాఠశాల కళాశాల సిబ్బంది విద్యార్థినిలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఔషధ మొక్కలపై అవగాహన అవసరం




మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రదీప్‌కుమార్

ప్రజాశక్తి -మారేడుమిల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం ఆకుమామిడి కోట గ్రామంలో మెడిసినల్ బోర్డు ఆధ్వర్యంలో వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ మెడిసినల్ బోర్డు విజయవాడ వారిచే నిర్మించబడుతున్న గిడ్డంగిని మెడిసినల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రదీప్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. దీనిలో ఔషధమొక్కలు, సుగంధద్రవ్యాల ద్వారా లభ్యమయ్యే ఉత్పత్తులను భద్రపరుస్తారు. అనంతరం వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉప్పరి గోతులు గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారేడుమిల్లి, వై రామవరం మండలాల ఏజెన్సీ ప్రాంతాలు సుగంధ మొక్కలు, ఔషధ మొక్కల పెంపకానికి అనుకూలమైన ప్రాంతమని ఔషధాలు, సుగంధ ద్రవ్యాలకు ప్రస్తుతం గిరాకీ ఉందని, ఆదరణ పెరుగుతుందని ఈ గిడ్డంగి సదుపాయాన్ని ఉపయోగించుకుని లబ్ది పొందాలని సూచించారు. సమావేశంలో వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అనుదీప్ కుమార్, గిరిజనులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిని నియమించండి

ప్రజాశక్తి -కొయ్యూరు: సచివాలయ సిబ్బందిని నియమించాలని పీసా మాజీ మండల ఉపాధ్యక్షులు కాకర స్వామినాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రం రాజేంద్రపాలెం గ్రామ సచివాలయం పరిధిలో 3 నెలలకు పైగా సిబ్బంది లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారని డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఇతర సిబ్బందిని తక్షణమే నియమించాలని, కొయ్యురు మండల పీసా మాజీ ఉపాధ్య క్షులు కాకర స్వామినాయుడు అధికారులను కోరారు. బదిలీల అనంతరం సచివాలయంలో కనీసం ఇంచార్జిలను కూడా నియమించ లేదని, దీనివలన రేషన్ కార్డు తప్పుల సవరణ, ఇకెవైసి, సదరం, లేట్ రిజిస్ట్రేషన్ వంటి అనేక ప్రభుత్వ సర్వీసుల కొరకు, పంచాయతీ ప్రజలు సచివాలయం నుండి వెనుతిరగాల్సి వస్తోందని తెలిపారు. వేరే సచివాలయానికి వెళితే, ఇన్‌చార్జి మేము కాదని ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయానికి శాశ్వత సిబ్బందిని నియమించాలని మాజీ మండల పీసా ఉపాధ్యక్షులు స్వామినాయుడు అధికారులను కోరారు

కరాటేతో మహిళలకు స్వీయరక్షణ



కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు

ప్రజాశక్తి- కొయ్యూరు: మహిళల స్వీయ రక్షణకు కరాటే నేర్చుకోవటం అవసరమని కరాటే కోచ్ పాండురాజు తెలిపారు. పీఎం ఉష అండర్ గెల్ స్కీమ్ ద్వారా 30 రోజులు నిర్వహించనున్న సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణను కొయ్యూరు మండలం మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సుధ, పాడేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి ప్రారంభించారు. కరాటే శిక్షణను పాడేరు, అరకు, చింతపల్లి డిగ్రీ కళాశాలల్లో అందిస్తున్నామన్నారు.

కృత్రిమ మేధతో ఔషధరంగంలో అపార అవకాశాలు

గీతం సదస్సులో పరిశ్రమల నిపుణుల వెల్లడి



సదస్సును ప్రారంభిస్తున్న అనంత రామకృష్ణ

ప్రజాశక్తి-మధురవాడ : కృత్రిమమేధతో ఔషధరంగంలో అపార అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. నూతన ఔషధాల తయారీ నుంచి ఔషధనాణ్యత ప్రమాణాలను పరీక్షించే దశ వరకు ఎఐ నిపుణులు పెద్దఎత్తున అవసరమవుతారన్నారు. శుక్రవారం గీతం వర్సిటీ వేదికగా ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ (ఐపిఎ) నిర్వహించిన సదస్సును గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ డాక్టర్ ఎస్.అనంతరామకృష్ణ ప్రారంభించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన గీతం ఫార్మసీ స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ పది నుంచి ఇరవై ఏళ్లు పట్టే నూతన ఔషధాల తయారీ ఇపుడు కృతిమమేధ సాయంతో మూడేళ్లలోపే సాధ్యమౌతుందన్నారు. నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ క్లినికల్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ సి.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ కృత్రిమమేధ సాయంతో రానున్న రోజులలో కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకువ్యాక్సిన్ అందుబాటులోకి రానుందన్నారు. యామ్నెల్ ఫార్మస్యూటికల్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కృత్రిమ మేధ ఆధారంగా శరీర తత్వాన్ని బట్టి ఔషధాలతో చికిత్సను అందించవచ్చునన్నారు. క్లీనోసోల్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ముజిబుద్దిన్ షేక్ మాట్లాడుతూ కృత్రిమ మేధతో పాటు క్లీనికల్ డేటా సైన్స్ నిపుణులు అవసరం ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతోందన్నారు. ఆర్కోల్యాబ్స్ నిపుణుడు డాక్టర్ శివకార్తిక్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో భద్రత ప్రమాణాలు కీలకమని, దీనికి కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్, క్వాంటమ్ ఎనలిటిక్స్‌తో కచ్చితమైన ఫలితాలను గుర్తిస్తున్నారన్నారు. శాండోజ్ సంస్థ ఔషధ భద్రత అధికారి డాక్టర్ శ్రద్ధాభంగే మాట్లాడుతూ ఔషధాల నాణ్యత గుర్తింపులో ఫార్మకో విజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రకాశీ మాట్లాడుతూ కృత్రిమమేధతో ఔషధాల నాణ్యతను తక్కువ సమయంలో గుర్తించవచ్చన్నారు.కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ ఉమాదేవి,సీనియర్ మేనేజర్ ప్రభ రాజమహంతి పాల్గొన్నారు.